క్లుప్తంగా

విద్యార్థులకు డైరీల పంపిణీ



బాన్సువాడ రూరల్: కోనాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 72 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన సీహెచ్ సాయిబాబా డైరీలను ఉచితంగా పంపిణీ చేశారు. గత విద్యాసంవత్సరం సాయిబాబా కుమార్తె లాస్య పదో తరగతిలో 551 మార్కులు సాధించడంతో మిగిలిన విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉండాలని డైరీలు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం శేఖర్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వితవ్వ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు..



బాన్సువాడ: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మంగళవారం పాఠ్య పుస్తకాలను ప్రిన్సిపల్ అసద్ ఫారూఖ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలో ఏకైన బాలికల జూనియర్ కళాశాల బాన్సువాడలోనే ఉందని, అంకిత భావం, అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని అన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధ్యాపకులు గంగాధర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని 6వ వార్డులో కాంగ్రెస్ నాయకులు మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఎల్లారెడ్డికి చెందిన అనితకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.16 వేల చెక్కు మంజూరు కావడంతో కాంగ్రెస్ నాయకులు ఆమె ఇంటికి వెళ్లి అందించారు. నాయకులు షెకావత్, నరేష్, కాశీరాం తదితరులున్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో అనిల్‌కుమార్ సూచించారు. ఈ నెల జూన్ 5 లోపు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన రైతులు ఈ నెల జూన్ 18 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, డిజిటల్ సంతకం అయిన జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంకు సేవింగ్ అకౌంట్ జిరాక్స్‌తో పాటు దరఖాస్తు ఫారంతో సంబంధిత ఏఈవోలకు అందజేయాలన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి



ఎల్లారెడ్డిరూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని సొసైటీ చైర్మన్ నర్సింలు అన్నారు. మంగళవారం సొసైటీలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో సొసైటీ లావాదేవీలను కార్యదర్శి విశ్వనాథం చదివి వినిపించారు. వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, డైరెక్టర్లు గోపి, నారాయణ, సుఖేందర్‌గౌడ్, ప్రకాష్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



బిచ్కుంద(జుక్కల్): శాంతాపూర్, పెద్ద తక్కడ్‌పల్లిలో మంగళవారం ఎంపీడీవో గోపాల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడారు. ఎంత త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తే అంత తొందరగా బిల్లులు చెల్లిస్తామన్నారు. ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చని తెలిపారు.

పైపులు ఏర్పాటు చేయాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి శివారులో నిర్మిస్తున్న అర్బన్ పార్కు వద్ద పూడ్చి వేసిన కాలువ వద్ద పైపులను ఏర్పాటు చేయాలని లింగారెడ్డిపేట గ్రామస్తులు మంగళవారం ఎఫ్ఆర్‌వో ఓంకార్‌ను కోరారు. ఈమేరకు వినతిపత్రం అందించారు. లింగారెడ్డిపేట చెరువుకు నీటి సౌకర్యం ఉన్న కాలువను మూసి వేయడంతో చెరువులోని నీరు వచ్చే అవకాశం ఉండదని దీనిని దృష్టిలో ఉంచుకుని మూసి వేసిన కాలువలో పైపులను ఏర్పాటు చేయాలని వారు విన్నవించారు. గ్రామస్తులు రాము, మల్లయ్య తదితరులున్నారు.

దహన సంస్కారాలకు ఇబ్బందులు

- గ్రామాలకు దూరంగా అధిక శాతం వైకుంఠధామాలు
- చాలా చోట్ల రోడ్డు సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న వైనం
- రూ. లక్షల నిధులు వృథా
- రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్న ప్రజలు



రాంపూర్‌గడ్డ తండాలో దారి లేని వైకుంఠధామం

గాంధారి(ఎల్లారెడ్డి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణాలో మరణించిన వారి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు వారి బంధువులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అప్పటి సీఎం కేసీఆర్ ప్రతి గ్రామంలో వైకుంఠధామాలు నిర్మించాలని ఆదేశించి నిధులు మంజూరు చేశారు. దీంతో అన్ని గ్రామాల్లో లక్షల రూపాయలు వెచ్చించి నీటి వసతి, స్నానాల గదులతో పాటు విశ్రాంతి గదులతో వైకుంఠధామాలు నిర్మించారు. కాని వివిధ కారణాలతో అన్ని గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో లేక నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో గ్రామాలకు దూరంగా నిర్మించడం, కొన్ని గ్రామాల్లో చెరువులు, కుంటల శిఖం భూమిలో నిర్మించడం, కొన్ని వైకుంఠధామాలకు సరైన దారి లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలో అప్పుడు 44 గ్రామ పంచాయతీలుండగా 44 వైకుంఠధామాలకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం తిమ్మాపూర్ జీపీ నుంచి పిస్కిల్ గుట్ట తండాను జీపీగా మార్చడంతో 45 జీపీలు ఏర్పాటయ్యాయి. 44 వైకుంఠధామాల్లో రాంపూర్ గడ్డ తండా జీపీ శివారులో వైకుంఠధామం కోసం అప్పటి తహసీల్దార్ 3.10 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఆ భూమిలో రూ.14 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వెచ్చించి అన్ని హంగులతో ప్రభుత్వం నిర్దేశించిన మేరకు బోరు, మోటారుతో సహా అన్ని నిర్మాణాలు పూర్తి చేశారు. కాని దారి వేయడం మర్చిపోయారు. ఫలితంగా ఇంతవరకు ఒక్క దహన సంస్కారం కూడా జరగలేదు. మండలంలో ఇదే మాదిరిగా చాలా వైకుంఠధామాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇదే అదనుగా భావించి కొందరు గదుల తలుపులు, కిటికీలు ధ్వంసం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని దారులు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

దారి లేక నిరుపయోగం



గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని గుర్తించి అప్పటి తహసీల్దార్ 3.10 ఎకరాల భూమి కేటాయించి నిర్మించారు. కాని వైకుంఠధామానికి వెళ్లడానికి అడ్డంగా పట్టా భూములున్నాయి. భూ యజమానులు దారి ఇవ్వబోమని మొండికేశారు. నచ్చ చెప్పినా వినలేదు. దీంతో దారి లేక నిరుపయోగంగా ఉన్నది. అధికారులు ఆ రైతులతో మాట్లాడి దారి ఏర్పాటు చేయాలి.

– భాగ్య నాయక్, రాంపూర్ గడ్డ తండా

చర్చించి దారి ఏర్పాటు చేస్తాం

మండల పరిధిలోని 44 గ్రామ పంచాయతీలకు వైకుంఠధామాలు నిర్మించాం. కొన్ని గ్రామాల్లో ఉపయోగిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వివిధ కారణాలతో వినియోగించడం లేదు. రాంపూర్ గడ్డ తండా వైకుంఠధామానికి వాస్తవంగా దారి లేదు. తహసీల్దార్‌తో చర్చించి దారి ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకొస్తాం.

– రాజేశ్వర్, ఎంపీడీవో, గాంధారి

నకిలీ విత్తు.. కావొద్దు చిత్తు

- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో అప్రమత్తత అవసరం
- గుర్తింపు పొందిన విత్తనాలే మేలు
- వ్యవసాయాధికారుల సూచనలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వర్షాకాలం సమీపించడంతో రైతన్నలు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందుకు డబ్బులు సమకూర్చుకుంటున్నారు. ఈ సమయంలో గ్రామాల్లో వివిధ కంపెనీల ప్రచారం జోరందుకుంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రచారాలను ఆర్భాటంగా సాగిస్తున్నారు. విత్తనాలకు సంబంధించిన కంపెనీలు గ్రామాలు, పట్టణాల్లో రైతులను ఆకట్టుకునేలా బ్రోచర్లు, పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో మైక్‌సెట్లను పెట్టుకుని ప్రచారం చేస్తున్నారు. ఆయా కంపెనీల ప్రచారాలతో రైతులు మోసాలకు గురికావాల్సి వస్తోంది. రైతులు విత్తనాలు, ఎరువు కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచనలు చేస్తున్నారు. జిల్లాలో సీడ్స్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ లైసెన్సులు కలిగిన 361 దుకాణాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 5 లక్షల 21వేల 448 ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. అందులో అత్యధికంగా వరి 3 లక్షల 18 వేల 530 ఎకరాల్లో సాగు కోసం అంచనా వేశారు.

కావాల్సిన విత్తనాలు..

95 వేల 503 క్వింటాళ్ల వరి ధాన్యం, పత్తి విత్తనాలు 345 క్వింటాళ్లు, సోయాబీన్ 25 వేల 266 క్వింటాళ్లు, మొక్కజొన్న 4 వేల 161 క్వింటాళ్లు, శనగలు 852 క్వింటాళ్లు , పెసళ్లు 348 క్వింటాళ్లు, మినుములు 2,993 క్వింటాళ్ల విత్తనాలు అవసరముంటాయని అధికారులు అంచనా వేశారు.

ఎరువులు..

యూరియా 68 వేల 658.25 మెట్రిక్ టన్నులు, డీఏపీ 18 వేల 222.4 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 44 వేల 762.5 మెట్రిక్ టన్నులు అవసరమని అధికారులు అంచనా వేశారు.

'గ్రామీణ రోడ్లకు నిధులు ఇవ్వండి'



నిజాంసాగర్(జుక్కల్): గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని మంగళవారం మంత్రి సీతక్కను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. నిధుల విషయమై మంత్రి సానుకూలంగా స్పందించి మారుమూల జుక్కల్ నియోజకవర్గానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

బీజేపీ రచ్చబండ సమావేశం



మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సంకల్ప సహకార కార్యక్రమంలో భాగంగా రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తోట బాల్‌రాజు మాట్లాడారు. బీసీలకు, రైతులకు మోదీ చేసిన మేలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు లక్ష్మీపతి, రవీందర్, గంగారాం, వెంకన్న, బూస సురేశ్, తదితరులున్నారు.

ఎలక్ట్రికల్, మోటార్ రివైండింగ్ యూనియన్ కమిటీ ఎన్నిక



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో తెలంగాణ ఎలక్ట్రికల్ అండ్ ఇంజినీరింగ్ మోటార్ రివైండింగ్ యూనియన్ జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముఖీం, ఉపాధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సందెల రాజు, కోశాధికారిగా సాయిబాబాలను ఎన్నుకున్నారు. మండలాల వారీగా పర్యటించి జిల్లా పూర్తి స్థాయి కమిటీని త్వరలో ఎన్నుకుంటామని నూతన అధ్యక్షుడు ప్రకటించారు. యూనియన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్లు చంద్రమౌళి, సాయిబాబా, అబ్దుల్లా, జిల్లా నాయకులు అజ్మత్, షబ్బీర్, వెంకట్ గౌడ్, బాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాచారం..

టీజీటీ సైన్స్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: కొత్తాబాదిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో టీజీటీ సైన్స్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కమల్ కిషోర్ పవార్ తెలిపారు. బీఎస్సీ సైన్స్‌తోపాటు బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై అనుభవం ఉన్న అభ్యర్థులు ..పాఠశాలలో దరఖాస్తు సమర్పించాలన్నారు. డెమో ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుడు 6, 7, 8 తరగతులకు ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 94939 28450.

నేడు క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

పిట్లం/గాంధారి(ఎల్లారెడ్డి): క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం బుధవారం గాంధారి జెడ్పీ ఉన్నత పాఠశాలలో, పిట్లం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నేడు ఎంపికలు ఉంటాయని ఎంఈవోలు శ్రీహరి, దేవీసింగ్‌లు వేర్వేరుగా తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు వారి బోనఫైడ్, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని సూచించారు. సెప్టెంబర్ 1, 2016 నుంచి ఆగస్టు 31, 2017 మధ్యలో జన్మించిన విద్యార్థులు అర్హులని, ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. గాంధారిలో ఉదయం 9 గంటలకు, పిట్లంలో మధ్యాహ్నం 2 గంటలకు హాజరు కావాలన్నారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి అర్బన్: క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న కామారెడ్డి మండల విద్యార్థులు నేటి ఉదయం 9 గంటలకు గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిపోర్టు చేయాలని ఎంఈవో ఎల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రిపోర్టు చేసిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి జిల్లా స్థాయికి పంపనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్: క్రీడా పాఠశాలల్లో ఎంపిక కోసం ఈ నెల 19న ఉదయం 10 గంటలకు ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో రాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9581552434.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



భిక్కనూరు: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని కామారెడ్డి ఆర్డీవో వీణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులకు ఎలాంటి భూసమస్యలున్నా సదస్సులో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. వాటిని పరిశీలించి రైతులకు తగిన న్యాయం చేస్తామన్నారు. తహసీల్దార్ సునీత, ఆర్ఐ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



కంకర తేలిన కన్నాపూర్ రోడ్డు

బీటీ రోడ్డుగా మారేనా?

రామారెడ్డి: మండల కేంద్రాన్ని కలిపే కన్నాపూర్ రోడ్డు కంకర తేలి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. ఏళ్లుగా ఈ రోడ్డు ఇలాగే ఉంది. వర్షాకాలం వస్తే ఈ రోడ్డు మీదుగా చెరువు కట్టపై కన్నాపూర్ గ్రామం వెళ్లడం కష్టంగా మారుతోంది. ఈ రోడ్డును, చెరువు కట్టపై మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చి సమస్య పరిష్కరించాలి.

– రాము, కన్నాపూర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

విద్యుత్ శాఖాధికారుల కొత్త ఫోన్ నంబర్లు

బీబీపేట: దోమకొండ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖాధికారుల ఫోన్ నంబర్లను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినట్లుగా ఏడీఈ సుదర్శన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్యాడర్	ఫోన్ నంబర్	క్యాడర్	ఫోన్ నంబర్
ఏడీఈ సుదర్శన్‌రెడ్డి	8712482141	ఏఈ భిక్కనూర్ సౌత్	8712482116
సబ్ ఇంజనీర్ ఎస్‌డీ దోమకొండ	8712482110	సబ్ ఇంజనీర్ భిక్కనూర్	8712482117
ఏఈ దోమకొండ	8712482128	ఏఈ భిక్కనూర్ నార్త్	8712482109
సబ్ ఇంజనీర్ దోమకొండ	8712482129	సబ్ ఇంజనీర్ భిక్కనూర్ నార్త్	8712482112
ఏఈ బీబీపేట	8712482100	ఏఈ రాజంపేట	8712482137
సబ్ ఇంజనీర్ బీబీపేట	8712482101	సబ్ ఇంజనీర్ రాజంపేట	8712482138

మోదీ పాలనలోనే దేశాభివృద్ధి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మోదీ పాలనలోనే భారత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తుందని బీజేపీ లింగంపేట మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్ అన్నారు. మంగళవారం ఆయన లింగంపేట పెద్దమ్మ ఆలయం వద్ద బీజేపీ నాయకులతో కలిసి మోదీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టి 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ పాలనలో నోట్ల రద్దు, కరోనా సమయంలో దేశ ప్రజలకు అండగా నిలిచి ప్రాణాలను కాపాడటం, 370 ఆర్టికల్ రద్దు, త్రిపుల్ తలాక్ రద్దు, రామమందిర నిర్మాణం, డిజిటల్ ఇండియాతో పాటు పలు రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. నాయకులు రాంచందర్, శివన్న, నవీన్‌కుమార్, శ్రీకాంత్, ఉదేష్, రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక' పిల్లలను భవిత సెంటర్‌లో చేర్పించాలి



చిన్నారులకు ఫిజియోథెరపి చేస్తున్న వైద్యుడు



వసతులు పరిశీలిస్తున్న ఎంఈవో విజయ్‌కుమార్



దివ్యాంగ విద్యార్థిని సన్మానిస్తున్న ఎంఈవో శ్రీహరి

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత సెంటర్‌లో చేర్పించాలని ఎంఈవో షౌకత్ అలీ సూచించారు. మంగళవారం లింగంపేట భవిత సెంటర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా సమ్మిళిత విద్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిత సెంటర్‌లో ఫిజియోథెరపిస్ట్.. వారికి వ్యాయామం చేయించి వైకల్యాన్ని దూరం చేస్తారన్నారు. ప్రభుత్వం ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థుల కోసం విద్య, వైద్యం, ఉపకరణాలు, ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. ఉపాధ్యాయులు మణికంఠ, మౌనిక, ఐఈఆర్‌పీ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సేవలను వినియోగించుకోవాలి

దోమకొండ: భవిత కేంద్రం సేవలను వైకల్యంతో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఎంఈవో విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో సమ్మిళిత విద్య కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు. జనాభాలో వైకల్యంతో పుట్టే వారి సంఖ్య పెరుగుతుందని, వారికి అనుగుణంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సేవలను అందిస్తున్న భవిత సిబ్బందిని అభినందించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పన్యాల శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం రాధాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే విజయాలు సాధిస్తారు

గాంధారి(ఎల్లారెడ్డి): దివ్యాంగ చిన్నారులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎంఈవో శ్రీహరి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న ఫిజియోథెరపి సేవలు, దివ్యాంగులకు అందజేస్తున్న పరికరాలను పరిశీలించారు. ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణుడైన దివ్యాంగుడు కె. ప్రవీణ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు.

సంక్షిప్తం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జీపీ కార్యదర్శి భీంరావు.. ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను కార్యదర్శి సందర్శించారు. ఆయన వెంట కారోబార్ సాయిలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): మెంగారంలో మంగళవారం ఎంపీవో మలహరి పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈసందర్భంగా వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. ప్రతి రోజూ తడి, పొడి చెత్త వేరు చేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలని కార్యదర్శికి సూచించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

రెండు గ్రామాల్లో పిల్లలకు వైద్య పరీక్షలు

గాంధారి(ఎల్లారెడ్డి): కరక్‌వాడి, పల్లెల మడుగు తండాలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసినట్లు ఎంఈవో శ్రీహరి తెలిపారు. డాక్టర్ గౌతమి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయగా ఆఫ్తాల్మిక్ సహాయకులు హరికిషన్ రావు కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు.

పార్టీలకు అతీతంగా రైతులను ఏకం చేయాలి

కామారెడ్డి అర్బన్: భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) కామారెడ్డి మండల సమావేశం మంగళవారం అధ్యక్షుడు కొమిరెడ్డి చిన్న అంజనేయులు అధ్యక్షతన నిర్వహించి రైతుల వివిధ సమస్యలపై చర్చించారు. పార్టీలకు అతీతంగా రైతులను ఏకం చేయాలని తీర్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశం , ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, ప్రతినిధులున్నారు.

స్థానిక పోరుకు సిద్ధం కావాలి

భిక్కనూరు: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సూచించినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీంరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన, మంత్రిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

గ్రామ సంఘం పదాధికారులకు శిక్షణ

దోమకొండ: మండల మహిళా సమాఖ్య పరిధిలోని గ్రామ సంఘం పదాధికారులకు మంగళవారం దోమకొండ ఐకేపీ కార్యాలయంలో జిల్లా సీఆర్పీలు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పదాధికారుల విధులు, బాధ్యతలు, ఆర్థిక లావాదేవీల నిర్వహణ, సంఘ సమావేశాలు, పుస్తకాల నిర్వహణ, జీవనోపాధుల పెంపుదల అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ హాజరై పలు సూచనలు చేశారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో త్వరలో జరిగే 16వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని అందరు సహకరించాలని ఎంపీడీవో సాజీద్‌అలీ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ బృందం సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఏపీవో కృష్ణగౌడ్, ఎంపీవో సవితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

భిక్కనూరు: ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను మంగళవారం హైదరాబాద్‌లో భిక్కనూరు, బస్వాపూర్, అంతంపల్లి, తిప్పాపూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాల నాయకులు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.